## క్లుప్తంగా

### ప్లాస్టిక్ నిషేధానికి భక్తులు సహకరించాలి



గుబ్బల మంగమ్మ గుడి వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం:** మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా గంగరాజు, కోర్సా రాంబాబు కోరారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి భక్తులు లక్షల్లో వచ్చేవారు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ విస్తర్లు తీసుకొస్తున్నారని దీని వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అయితే మంగమ్మ దర్శనానికి వచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులు తీసుకురావొద్దని కోరారు. అలాగే గుబ్బల మంగమ్మ పరిసర ప్రాంతాల్లో భక్తులు వాడి పడేసిన ప్లాస్టిక్ వస్తువులను శుభ్రం చేశారు.

### సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలి

**బుట్టాయగూడెం:** కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ)లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం సీఆర్‌టీయూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు కంగాల గోపాలకృష్ణ మాట్లాడుతూ సీఆర్‌టీలుగా తాము సుమారు 13 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని చెప్పారు. సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తెల్లం రమేష్, కుంజా వెంకటేశ్వరరావు, పి.పోసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

### పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**లింగపాలెం:** పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలు ఇవ్వాలని లింగపాలెం వెటర్నరీ అధికారి కిరణ్ రైతులకు తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా బుధవారం మండలంలోని మఠంగూడెం గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కిరణ్ మాట్లాడుతూ మండలంలో 29265 గేదెలు, 3,265 ఆవులు ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ 15 వరకు పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పారిజాతగిరిలో పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**జంగారెడ్డిగూడెం:** గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరాయి. విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనంతో ప్రారంభించి అనంతరం పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ, తదితర పూజలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞ బ్రహ్మ పానంగపల్లి సత్య పవనకుమారాచార్యులు, రుత్వికులు అభిరాం, నిరంజన్ స్వాములు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్య నిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ నాయకుల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**జంగారెడ్డిగూడెం:** పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి వైఎస్సార్ సీపీ నాయకులు సహాయం అందించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మద్రిపూడి సూరిబాబు పక్షవాతంతో బాధపడుతున్నాడు. స్పందించిన దాతలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏవీ రమణమూర్తి (మానవత మూర్తి) రూ.7000, మానుకొండ అశోక్‌కుమార్ రూ.5000, గంజి దండు రూ.5000 మొత్తం రూ.17 వేలు వైఎస్సార్ సీపీ యువ నాయకులు జెట్టి ఆదిత్య చేతుల మీదుగా అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అన్నెపు ఆదినారాయణ, కేమిశెట్టి మల్లిబాబు, మైరెడ్డి జగదీష్, దాసరోజు స్వాతి, మానుకొండ అశోక్ కుమార్, నాగు పాల్గొన్నారు.

### దసరా బోనస్ అందించాలి

**కుక్కునూరు:** సివిల్ సప్లై హమాలీలతో పాటు జీసీసీ హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లూరి సీతారామరాజు హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు.

# ఉపాధ్యాయుల కొరత తీరేనా?

- ఏజెన్సీలో పూర్తి స్థాయిలో భర్తీ కాని వైనం
- గాడి తప్పుతున్న విద్యా వ్యవస్థ



ఉపాధ్యాయుల భర్తీ కోరుతూ దీక్షను చేస్తున్న వారిని విరమింపజేస్తున్న నేతలు (ఫైల్)

**కుక్కునూరు:** ప్రభుత్వం డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోస్టులకు పూర్తి స్థాయిలో ఉద్యోగుల నియామకం జరుగుతుందా అన్న సందేహాలు ఏజెన్సీ ప్రాంత వాసుల్లో నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ చేపట్టింది. బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులు మొత్తం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి ఇతర అభ్యర్థులను కేటాయించకపోవడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు పాఠాల బోధన కుంటుపడింది. విద్యార్థుల దయనీయ పరిస్థితి చూసిన పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు రిలే నిరాహార దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రిలే నిరాహార దీక్షలతో ప్రభుత్వ ప్రతిష్ట దిగజారుతుండడంతో విద్యాశాఖాధికారులు విద్యా వలంటీర్లను నియమిస్తామని చెప్పి నిరాహార దీక్షలను విరమింపచేశారు. అయినా విద్యార్థులకు మాత్రం న్యాయం జరగలేదు.

**ప్రస్తుత డీఎస్సీలోనైనా భర్తీ అయ్యేనా?**

ప్రస్తుతం డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం వెబ్ ఆప్షన్ పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ పాఠశాలల్లో ఎస్జీటీ ఖాళీలు 350 ఉండగా ప్రభుత్వం 260 ఖాళీలకు నోటిఫికేషన్ ఇచ్చింది. కాగా ఏజెన్సీ మండలమైన కుక్కునూరులో ఎస్జీటీ ఖాళీలు దాదాపుగా 79 వరకు ఉన్నాయి. అభ్యర్థులకు పోస్టింగ్ ప్రదేశం ఎంచుకునే అవకాశం ఇస్తే కేవలం ఈ మండలానికి సంబంధించిన వారు తప్ప ఇతరులు ఏజెన్సీలకు రావడానికి ఇష్టపడతారా అనే ప్రశ్న ఇక్కడి వారిని వేధిస్తుంది. ఒక వేళ అభ్యర్థులకు ఆప్షన్ ఇవ్వకుండా ప్రభుత్వమే ముందుగా ఖాళీలను నింపేలా ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలకు పోస్టింగ్ ఇస్తే తప్ప ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు న్యాయం జరగదని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతమన్న చిన్నచూపు చూస్తుందో లేక ప్రాముఖ్యతనిచ్చి ఖాళీలను నింపుతుందో లేదో వేచి చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా

**కుక్కునూరు మండలం పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు**

| పాఠశాల | మొత్తం పాఠశాలలు | కేటాయించిన పోస్టులు | ఖాళీ పోస్టులు |
|---|---|---|---|
| ఎంపీపీఎస్ | 37 | 73 | 55 |
| ఎంపీయూపీఎస్ | 6 | 35 | 24 |
| మొత్తం | 43 | 108 | 79 |

**ఏజెన్సీలోని ఖాళీలను భర్తీ చేయాలి**



కుక్కునూరు మండలంలోని మండల పరిషత్ పాఠశాలల్లో మొత్తం 70కు పైగా ఎస్జీటీ ఖాళీలున్నాయి. ముందుగా డీఎస్సీ అభ్యర్థుల నియామకం చేపట్టనున్న నేపథ్యంలో ముందుగా ఏజెన్సీ ప్రాంత ఖాళీలను నింపి ఇక్కడి విద్యార్థులకు న్యాయం చేయాలి. లేని పక్షంలో విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మరో సారి ఉద్యమం చేపడతాం.

–కొలికపోగు లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

**ఏజెన్సీ ప్రాంతానికి న్యాయం చేయాలి**



ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ముందుగా ఏజెన్సీ ప్రాంతంలోని ఖాళీలను నింపి ఇక్కడి వారికి న్యాయం చేసిన తరువాతే ఇతర ప్రాంతాలకు ప్రాముఖ్యత నివ్వాలి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నాలుగు నెలలుగా పాఠాలు బోధించే వారు లేక ఇక్కడి విద్యార్థులు ఎంతో నష్టపోయారు. డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం వెబ్ ఆప్షన్ కల్పించడంతో వారు ఇతర ప్రాంతాలను సెలక్ట్ చేసుకునే అవకాశం ఉంది. అలా జరిగితే మరలా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం ఈ విషయమై మంచి నిర్ణయం తీసుకోవాలి. –కొన్నె లక్ష్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి

### మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్ సీపీ అధినేతను కలిసిన పార్టీ నేతలు

**చింతలపూడి:** వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి , సీనియర్ నాయకులు గోలి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపినట్లు జ్ఞానారెడ్డి తెలిపారు.

### వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిసిన ధర్మరాజు



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధర్మరాజు

**జంగారెడ్డిగూడెం:** వైసీపీ అధినేత , మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జంగారెడ్డిగూడేనికి చెందిన వైస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ కుక్కల ధర్మరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అధినేతను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### అయ్యప్ప ఆలయంలో పూజలు

**జంగారెడ్డిగూడెం:** మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషకాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది. భక్తులు పాల్గొని పూజలు చేశారు.

### కామ్రేడ్ కొల్లాకు నివాళి

**కొయ్యలగూడెం:** మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కామ్రేడ్ కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి కార్యక్రమం బుధవారం కన్నాపురంలో నిర్వహించారు. సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం అంటూ నినదించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన ఘనత వెంకయ్యది అన్నారు. వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మడకం రామన్న, డి.రంగనాథం, మందలపల్లి రాజు, జి.నాగమణి, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఐటీఐ కాలేజీ వద్ద వికాస్ దివాస్

**బుట్టాయగూడెం:** మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద బుధవారం వికాస్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, మమత సర్వీస్ సంస్థ అధ్యక్షురాలు కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీవోగా మణికుమారి

**పోలవరం రూరల్:** పోలవరం ఎంపీడీవో జి.మణికుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె టి.నరసాపురం మండలంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై పోలవరం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మణికుమారి ఈ సందర్భంగా తెలిపారు.

### సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జంగారెడ్డిగూడెం:** సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చింతలపూడి నియోజకవర్గ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు బుధవారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యోగులు ఈ.నరేష్, దుర్గారావు, రాజ్ కుమార్, రామకృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

**జంగారెడ్డిగూడెం:** ఏళ్లు గడుస్తున్నా నేటికి పట్టెన్నపాలెం హైలెవల్ బ్రిడ్జి పూర్తి కాలేదని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాగు ఉధృతంగా వస్తే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటోందని, గతంలో వ్యవసాయ కార్మికులు, రైతులు సుమారు 20 మంది వరకు గల్లంతయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం పరిశీలించి ఈ బ్రిడ్జి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**చింతలపూడి:** మండలంలోని నరసింగపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు సూరిబాబు కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. అనంతరం సూరిబాబు కుటుంబానికి లక్షా 30 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎస్.రమేష్‌రెడ్డి, బీవీఎస్ రెడ్డి, గోలి శరత్ రెడ్డి, టి.భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర



నేతలతో సమన్వయకర్త విజయరాజు

**ఏలూరు టౌన్:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, చేయలేదనీ అసత్య ప్రచారం చేయటంతోపాటు మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ చేస్తోన్న కుట్రలకు నిరసనా ఈనెల 19న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. ఏలూరులో బుధవారం ఆయన చింతలపూడి నియోజకవర్గం యువజన, విద్యార్థి విభాగం నేతలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు చేపటట్టే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, కూటమి నేతలు, సీఎం చంద్రబాబు ఏమీ కట్టలేదంటూ అసత్య ప్రచారం చేయటం దారుణమని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని కోరారు. 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఏదైనా ఒక్క గొప్ప కార్యక్రమాన్ని చేశారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొమ్మిన నరేష్, పార్టీ కామవరపుకోట మండల అధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ, తడికలపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు గుత్రాల రవికుమార్, జంగారెడ్డిగూడెం మండల యువజన అధ్యక్షుడు గంజి వినోద్, కుచలపాటి మహేష్, వానచర్ల లింగాస్వామి, పడాల శ్రీను, గుడే పెద్దిరాజు, మాంద్రు దాసు, జెట్టి రాజేష్, కె.అంజి, కంచె రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

**చలో 'మెడికల్ కాలేజీ' విజయవంతం చేయాలి**



తెల్లం బాలరాజు

**బుట్టాయగూడెం:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 19వ తేదీన విద్యార్థి యువజన విభాగాల ఆధ్వర్యంలో జరిగే ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. బుధవారం సాయంత్రం మండలంలోని దుద్దుకూరులో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

### ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాలు

**ద్వారకాతిరుమల:** మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి సమేత విశ్వకర్మ ఆరాధనా, యజ్ఞ మహోత్సవాలను స్థానిక ఆళ్వార్ సదనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నేతలు, సభ్యులు, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెంలో..**

**కొయ్యలగూడెం:** విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

**టి.నరసాపురంలో..**

**టి.నరసాపురం:** మండల కేంద్రం టి.నరసాపురంలో శ్రీ గాయత్రి సమేత విశ్వకర్మ జయంతి వేడుకలు విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బంధంచర్ల రోడ్డులో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

**లింగపాలెంలో..**

**లింగపాలెం:** మండలంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వరయలో శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుడి జయంతిని పురస్కరించుకుని భారీ ఊరేగింపు నిర్వహించారు.

**జంగారెడ్డిగూడెంలో..**

**జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెంలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక బైనేరు వద్ద ఉన్న విశ్వకర్మ ఆలయంలో విశ్వకర్మ భగవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మండలాభివృద్ధికి కృషి

**జంగారెడ్డిగూడెం:** జిల్లా పరిషత గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేయించి, మండలాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిమ్మలగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ పాఠశాలకు మార్చాలని ఎంపీటీసీ టి.నిర్మల కుమారి వినతిపత్రం అందజేశారు.

### యూరియా నిల్వల పరిశీలన

**బుట్టాయగూడెం:** దర్భగూడెం, కామయ్యపాలెం సొసైటీల డీసీఎంఎస్ యూరియా నిల్వలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేఆర్‌పురం ఐటీడీఏ వ్యవసాయశాఖ ఏడీఏ పీజీ బుచ్చిబాబు, ఏఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.





## 'కర్మయోగి'తో గిరిజనులకు ప్రయోజనం



గిరిజనులతో మాట్లాడుతున్న స్వాతి బత్రా

**వేలేరుపాడు:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆది కర్మయోగి పథకంతో గిరిజనులకు ప్రయోజనం చేకూరుతుందని, కేంద్ర బృందం ముఖ్య సహాయకురాలు స్వాతి బత్రా పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం హౌసింగ్ ఈఈ ప్రసాద్, ఎంపీడీవో శ్రీహరి, డిటి సురేంద్ర, విద్యుత్తు ఏఈ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

**జైనవారిగూడెంలో వర్క్‌షాప్**

**బుట్టాయగూడెం:** మండలంలోని జైనవారిగూడెంలో ఆదికర్మయోగి విలేజ్ వర్క్‌షాప్‌లో భాగంగా బుధవారం ట్రాన్సెక్ట్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటీడీఏ పీఓ కె. రాములు నాయక్ పీవీటీజీ డివిజన్ మోటా ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది మాట్లాడుతూ ప్రజలకు ఆదికర్మయోగి అభియాన్ లక్ష్యాలను వివరించారు. అనంతరం ర్యాలీ చేశారు. సర్పంచ్ తాటి సీత, ఈఎస్ఎస్ శ్రీనివాస్, రాజబాబు, పద్మావతి పాల్గొన్నారు.

**కృష్ణాపురంలో..**

**టి.నరసాపురం:** మండలంలోని కృష్ణాపురంలో బుధవారం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఇంటింటికి తిరిగి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంధం సునంద, ఎంపీడీవో నగరాజకుమారి, ఐటీడీఏ డీఎంటీ పొన్నారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఈవోపీఆర్‌డీ బీఎంటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### దిగువకు 3031 క్యూసెక్కులు

**జంగారెడ్డిగూడెం:** మండలంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వచ్చే వరద ప్రవాహం స్థిరంగా ఉంది. జలాశయంలోకి 2235 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 3031 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 82.48 మీటర్ల వద్ద కొనసాగుతోంది.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** పారిశుధ్యంపై దృష్టి పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వర్జీనియా వేలం కేంద్రం నిర్వహణ అధికారి బి.శ్రీహరి అన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రైతులు, వేలం కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా అన్నసమారాధన

**జంగారెడ్డిగూడెం:** స్థానిక అశ్వారావుపేట రోడ్డులో హైస్కూల్ వద్ద వెలసిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అన్నసమారాధనకు యశోద రామచంద్ర రావు కుమారుడు రాజా, మందోటి హరిబాబు చింతలపూడి సరోజినీ, కర్పూరం సాయి ప్రగడ బాలాజీ సహకరించినట్లు అన్నప్రసాద వితరణ కమిటీ ఆర్గనైజర్ కానూరు గంగాధరరావు తెలిపారు.

### రహదారులు అధ్వానంగా ఉండటం వాస్తవమే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

**కామవరపుకోట:** చింతలపూడి నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా ఉండటం వాస్తవమేనని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అంగీకరించారు. తడికలపూడి నుంచి రావికంపాడు వరకు అధ్వానంగా ఉన్న రహదారుల గురించి ఆర్ అండ్‌బీ ఏఈ సుందర్‌రావును జెడ్పీటీసీ కడిమి రమేష్ ప్రశ్నించగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ స్పందిస్తూ నియోజకవర్గంలో రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉండటం వాస్తవమేనని నిధుల కొరతతో రహదారులు నిర్మించలేకపోయామన్నారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీవో సరళ కుమారి, తహసీల్దార్ జి.ఎలీషా పాల్గొన్నారు.

### మహిళల అభివృద్ధికి స్వస్తి నారీ సశక్తి పరివార్

**చింతలపూడి:** ఎర్రగుంటపల్లి పిహెచ్‌సి పరిధిలోని రేచర్ల, పాత చింతలపూడి గ్రామాల్లో బుధవారం స్వస్థనారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 350 మందికి పైగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నరేష్, గీత, మండల పరిషత్ అధ్యక్షుడు రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెంలో..**

**కొయ్యలగూడెం:** స్వస్తి నారీ సశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ అడపా రాంబాబు, పంచాయితీ కార్యదర్శి బి.తాతబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు బాషా తదితరులు పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెంలో..**

**జంగారెడ్డిగూడెం:** బొర్రంపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ సూర్యకృష్ణవేణి, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ గిరీష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**కామవరపుకోటలో..**

**కామవరపుకోట:** సమాజ అభివృద్ధికి మహిళ ఆరోగ్యం దోహదపడుతుందని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి దివ్య తెలిపారు. కళ్ల చెరువు, అంకాలమ్మపాడు, వీరిశెట్టిగూడెం, తాడిచర్ల గ్రామాలలో మహిళా వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథి, వైద్యాధికారిణి డా.సుమ, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.